# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-08-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత దేశ బలం ప్రజల్లోనే ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**

2. **రాష్ట్రంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

3. **స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఈరోజు రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తుంది.**

4. **కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని పట్టణాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రముఖ తెలుగు కవి గురజాడ అప్పారావు రచించిన “దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా.. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్” అనే అమరమైన పద్యాన్ని ప్రస్తావించడంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్, దేశభక్తికి నిజమైన అర్థాన్ని, భారతదేశ గొప్పతనాన్ని ఆమె గుర్తు చేశారని పేర్కొన్నారు. భారత దేశ బలం కేవలం భూమిలో కాకుండా ప్రజల్లోనే ఉందని, ప్రతి భారతీయుడి గౌరవాన్ని కాపాడుతూ.. ప్రజలకు సాధికారత కల్పించి దేశ సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు.

-------------------------

రాష్ట్రంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డి, మంత్రులు వివేక్ వెంకట స్వామి, దామోదర రాజనర్సింహలతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రేషన్‌లో సన్న బియ్యం పంపిణీతో మార్కెట్‌లో బియ్యం రేట్లు తగ్గాయని చెప్పారు. రేషన్‌కార్డు కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదని, ఆత్మగౌరవమని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్....30 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని పట్టణాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 4 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన పురపాలక సంఘ కార్యాలయ భవనాన్ని పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ప్రథమ మహిళ సమీరా నజీర్ విజయవాడలోని లోక్‌భవన్ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తేనీటి విందును నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ హాజరయ్యారు. మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పార్లమెంట్ సభ్యులు, పలువురు శాసన సభ్యులు, పలువురు శాసన మండలి సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ అతిథులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ బొగ్గు, ఖనిజ భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఖనిజాలు, బొగ్గు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. దేశంలోని ఖనిజ సంపద పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునే దిశగా తాజాగా తీసుకొచ్చిన గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు ఒక ముందడుగు అని కిషన్ రెడ్డి వెల్లడించారు. అదే సమయంలో రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లోక్‌భవన్‌లో నిన్న ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు ఉన్నతాధికారులు, నగర ప్రముఖులు హాజరయ్యారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అమరావతిలోని పెరేడ్ గ్రౌండ్స్‌లో నిన్న నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దాదాపు 25 ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాల్లో విద్యా, ఉద్యానవన శాఖల శకటాలకు సంయుక్తంగా

ప్రథమ బహుమతి లభించిందని అధికారులు తెలిపారు. 'వికసిత్ భారత్ నిర్మాణంలో విద్యా విప్లవం' సందేశంతో విద్యాశాఖ ఈ శకటాన్ని రూపొందించిందన్నారు. చేనేత, జౌళి శాఖ శకటానికి ద్వితీయ బహుమతి దక్కించుకోగా, 'అడవులను రక్షించండి.. వన్యప్రాణులను కాపాడండి' నినాదంతో హరితాంధ్ర లక్ష్యాన్ని చాటిన అటవీ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించిందని పేర్కొన్నారు.

-----------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు గౌతు లచ్చన్న జయంతి ఈరోజు. 1909 ఆగస్టు 16వ తేదీన శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బారువ గ్రామంలో ఆయన జన్మించారు. రైతులు, ఓటు హక్కు లేని ప్రజల కోసం ఆయన పని చేశారు. గౌతు లచ్చన్న 21 సంవత్సరాల వయస్సులో పలాసలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు అయ్యారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటలకు గాను ఆయనకు సర్దార్ బిరుదు లభించింది. గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19వ తేదీన విశాఖపట్నంలో తుది శ్వాస విడిచారు.

-----------------------------

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని ఈరోజు రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర స్థాయి వేడుకలను విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న లచ్చన్న, జమీందారీ వ్యవస్థ రద్దు, రైతులు, బీసీల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని మంత్రి పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

-----------------------------

శ్రీలంకలోని గాలె నగరంలోని నిర్వహిస్తున్న భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లో భాగంగా నిన్న టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. దేవ్ దత్ పడిక్కల్ 131, రిషబ్ పంత్ 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండవ రోజు ఆట ఈ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుంది.

-----------------------------

వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, వాయువ్యదిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణం కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు వెల్లడించారు. వీటి ఫలితంగా ఉత్తర, దక్షిణ కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

-----------------------------

ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా వ్యాధుల నియంత్రణపై అనుకరణ వ్యాయామాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు తెలిపారు. తొలి దశలో కృష్ణా జిల్లాలో ఆగస్టు 18, 19 తేదీల్లో లెప్టోస్పిరోసిస్‌పై, పశ్చిమగోదావరి జిల్లాలో ఆగస్టు 20, 21 తేదీల్లో అత్యంత ప్రమాదకర ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజాపై ఈ వ్యాయామాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

======================